ఆర్టీసీకి యాడ్ ఏజెన్సీ కుచ్చుటోపీ

- **21 కోట్లు చెల్లించకుండా మోసం**
- **చెల్లని చెక్కులు ఇచ్చిన గో రూరల్ ఇండియా సంస్థ**
- **నిందితుడు సునీల్‌ను అరెస్టు చేసిన సీసీఎస్ పోలీసులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): టీఎస్‌ఆర్టీసీకి కుచ్చుటోపీ పెట్టాడు ఓ కేటుగాడు. ఖమ్మం జిల్లాకు చెందిన వీ సునీల్ 'గో రూరల్ ఇండియా' పేరుతో తన భార్య మృదులతో కలిసి యాడ్ ఏజెన్సీని నిర్వహిస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం చింతల్‌లో నివాసం ఉంటున్న సునీల్ టీఎస్‌ఆర్టీసీలో హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్‌లో 2015 నుంచి 2020 వరకు ఆర్టీసీ యాడ్స్ కాంట్రాక్ట్‌ను పొందాడు. హైదరాబాద్ రీజియన్‌కు 10,74,89,006, సికింద్రాబాద్ రీజియన్‌కు 10,97,38,389 కాంట్రాక్ట్ రుసుము చెల్లించాల్సి ఉన్నది. దాదాపు రూ.21,72,27,395 లీజు చెల్లించాల్సిన సునీల్.. ఉద్దేశపూర్వకంగా చెల్లని చెక్కులు ఇచ్చాడు. అవి చెల్లకపోవడంతో ఆర్టీసీ అధికారులు మోసం చేసినట్టు సునీల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు శుక్రవారం వీ సునీల్‌ను అరెస్టు చేశారు.

వర్సిటీల భూముల జోలికొస్తే ఖబడ్దార్!

- **ఒక్క అంగుళమైనా విడిచిపెట్టం**
- **ఉద్యాన వర్సిటీకి బీఆర్‌ఎస్వీ అండగా ఉంటుంది**
- **జీవో 55 రద్దు చేసేదాకా పోరు**
- **రాజేంద్రనగర్‌లో రేవంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారం**
- **బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఫైర్**
- **ధర్నాతో దద్దరిల్లిన అగ్రి వర్సిటీ.. పరీక్షలు వాయిదా**
- **ప్రధాన ఆఫీసుకు తాళ మేసి నిరసన**

యూనివర్సిటీలో జరిగిన విద్యార్థుల ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న గెల్లు శ్రీనివాస్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): 'ఖబర్దార్ రేవంత్‌రెడ్డి.. రాష్ట్రంలోని ఏ యూనివర్సిటీ భూముల జోలికి వచ్చినా ఊరుకునేది లేదు' అంటూ బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. హైకోర్టు కోసం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ భూములను కేటాయిస్తూ సర్కారు ఇచ్చిన జీవో 55ను వెంటనే వెనక్కి తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం వర్సిటీ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. వ్యవసాయ వర్సిటీకి సంబంధించిన ఒక అంగుళం భూమి కూడా విడిచి పెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. వ్యవసాయ హబ్‌గా ఉన్న రాజేంద్రనగర్ ప్రాంతాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారకేంద్రంగా మార్చడానికి రేవంత్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఉద్యాన యూనివర్సిటీ విద్యార్థులకు బీఆర్‌ఎస్వీ నిత్యం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ ఉద్యాన యూనివర్సిటీకి భూమి కేటాయిస్తే.. ఈనాటి రేవంత్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూమిని లాక్కోవాలని చూస్తున్నదని ధ్వజమెత్తారు. వందల ఎకరాల్లో హైకోర్టు నిర్మాణానికి పూనుకోవడంతో వృక్ష జాతులు అంతరించి పోతాయని, జీవజాతులు, అంతకుమించిన వ్యవసాయ పరిశోధనకు నిలయంగా ఉన్న అగ్రి బయో డైవర్సిటీ పార్కులో జంతుజాలం ఆవాసం కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బయోడైవర్సిటీ పార్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. వర్సిటీలో సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ప్రయత్నించగా విద్యార్థులు అడ్డుకున్నారు. ప్రధాన ఆఫీస్‌కు తాళం వేశారు.

ఆంధ్రా ఆంటీ తప్ప మేం కనిపించమా?: శ్రీజ

వ్యవసాయ వర్సిటీలోని భూములను హైకోర్టు నిర్మాణానికి కేటాయించొద్దని కోరుతూ 25 రోజుల నుంచి ఉద్యమిస్తున్నా.. ప్రభుత్వం ఇంకా స్పందించడం లేదని వ్యవసాయ వర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి శ్రీజ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఓ ఫుడ్‌స్టాల్ పెట్టుకున్న ఆంధ్రాకు చెందిన కుమారి ఆంటీ విషయంపై సీఎం ఒక్క రోజులనే స్పందించారు. మేం ఇంత మంది విద్యార్థులం అల్లాడుతుంటే ఎందుకు స్పందించడం లేదు? మేం ప్రభుత్వ వ్యతిరేకులం కాదు కదా? కాంగ్రెస్ ప్రభుత్వంలోని నాయకులు గత ప్రభుత్వం హయాంలో విద్యార్థులకు మద్దతుగా అనేక విషయాల్లో పోరాడారు కదా? మరి అధికారంలోకి వచ్చాక పరిష్కారం చూపడం లేదెందుకు?' అని నిలదీశారు. 'మా బాధ మీకు అర్థం కావడం లేదా? మా వ్యవసాయ వర్సిటీ దరిదాపుల్లోకి ఏ నిర్మాణాలు రావొద్దు. మా సదువులు మమ్మల్ని సదువుకోనియ్యండి అని మేం అడుగుతున్నాం. మేం రైతాంగానికి సేవలు చేయాలా? వద్దా? ఈ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందా? నిలువదా? మా వ్యవసాయ శాఖ అధికారులు సంతకాలు పెట్టి భూములను ప్రభుత్వానికి ఇచ్చేస్తున్నారనే సమాచారం మాకు తెలిసింది. మేం మాత్రం ఆ ప్రక్రియను సమర్థించం. ఇన్ని రోజులు అధికారుల ప్రమేయం లేకుండానే ప్రభుత్వం జీవో జారీ చేసిందని చెప్పారు. కానీ మా వర్సిటీ అధికారులే సంతకాలు చేసి ఒప్పుకున్నట్టు తెలిసింది. ఇది నిజమా? కాదా?' అని తెలియాల్సి ఉన్నదని అన్నారు. అది నిజమే అయితే వర్సిటీ అధ్యాపక సిబ్బంది మొత్తం రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినయ్, సత్యమూర్తి, విద్యార్థి నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగిత్యాల పొలాస వ్యవసాయ కళాశాల గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

అగ్రీ వర్సిటీ భూములు హైకోర్టుకు ఇవ్వొద్దు

- **జీవో 55ను వెంటనే రద్దు చేయాలి**
- **పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థుల ధర్నా**

వియ్ వాంట్ జస్టిస్

జగిత్యాలటౌన్, ఫిబ్రవరి 2 : రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని 100 ఎకరాల భూమిని హైకోర్టుకు కేటాయిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 55ను వెంటనే రద్దు చేయాలని జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం నిరసన తెలిపారు. తరగతులను బహిష్కరించి ధర్నా చేశారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ తీసి మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతాంగానికి సేవలు అందిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన భూములను హైకోర్టు నిర్మాణానికి ఇవ్వడం వల్ల వ్యవసాయ పరిశోధనలకు ఆటంకం కలుగుతుందని అన్నారు. అదేవిధంగా అక్కడ ఉన్న వివిధ జీవ వైవిధ్య వృక్ష, జంతు సంపదకు హాని కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 55ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కేరళ బియ్యం అవసరాలు తీరుస్తాం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): కేరళ రాష్ట్రానికి అవసరమైన బియ్యం అవసరాలను తీర్చగలమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇందుకోసం ఆ రాష్ట్ర అవసరాలు తీర్చే వరి ధాన్యాన్ని తెలంగాణలో పండిస్తామని తెలిపారు. కేరళ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనకర సహకారం, అవకాశాలపై ఆ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి జీఆర్‌అనిల్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేరళ రాష్ట్రానికి అవసరమైన కొన్నిరకాల వరిని తెలంగాణలో సాగు చేయడంపై మంత్రులిద్దరూ చర్చించారు. ఈ మేరకు ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న వివిధ అవకాశాలను చర్చించి ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒప్పందం కార్యరూపం దాలిస్తే ఉభయ రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. కేరళలో పండించే ఇతర ఆహార అవసరాలపైనా వారు చర్చించారు. సమావేశంలో కేరళ పౌర సరఫరాల కమిషనర్ డాక్టర్ సుజిత్‌బాబు, తెలంగాణ పౌర సరఫరాలశాఖ కమిషనర్ చౌహాన్ పాల్గొన్నారు.

పల్లె టెకీ 'స్మార్ట్ గవ్'

- **గ్రామీణ ప్రాంత ప్రజల కోసం మొబైల్ యాప్**
- **ఐఐఐటీ హైదరాబాద్ పూర్వవిద్యార్థి రూపకల్పన**

ఐఐఐటీ డైరెక్టర్ పీజే నారాయణన్‌తో 'స్మార్ట్ గావ్' మొబైల్ యాప్ రూపకర్త రజనీశ్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): గ్రామీణ ప్రజలకు వీలుగా ఉండేలా 'స్మార్ట్ గవ్' యాప్‌ను అభివృద్ధి చేశాడో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఐఐఐటీ హైదరాబాద్‌లో ఎంటెక్ చేసిన రజనీశ్ బాజ్‌పాయ్.. కాలిఫోర్నియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డారు. మాతృదేశానికి ఏదైనా చేయాలన్న తపనతో.. గ్రామీణ భారతదేశానికి స్మార్ట్ గవర్నెన్స్, ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్ కోసం ఆండ్రాయిడ్ యాప్ రూపొందించారు. 2017లో 2 నెలల సెలవుపై ఇండియాకు వచ్చి తాను పుట్టి పెరిగిన ప్రాంతాల్లో అధ్యయనం చేసి, ఆధునిక ప్రపంచంలో గ్రామాలకు ఏం కావాలో తెలుసుకొని ఈ యాప్‌ను రూపొందించారని, ప్రస్తుతం ఈ యాప్ దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందని ఐఐఐటీ ప్రతినిధి ఒకరు తెలిపారు.

విద్యా - ఉద్యోగ సమాచారం

• నేడు, రేపు గేట్ పరీక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక పరీక్ష గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్) పరీక్షలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. రెండు విడతల్లో జరిగే పరీక్షలను తొలుత శని, ఆదివారాల్లో ఆ తర్వాత 10, 11 తేదీల్లో నిర్వహిస్తారు. రాష్ట్రంలో 11 పట్టణాల్లో గేట్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. రాష్ట్రంలో ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, నిజామాబాద్, సూర్యాపేట, వరంగల్, హైదరాబాద్, మెదక్, నల్లగొండలో పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది రికార్డుస్థాయిలో గేట్‌కు 8 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

• స్కాలర్‌షిప్స్ దరఖాస్తుల గడువు పెంపు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. 2023-24కు విద్యార్థులు మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, వికలాంగ, మైనార్టీ విద్యార్థులు https://telanganaepass.cgg.gov.in సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

• తొలిసారిగా ఐఐటీ మద్రాస్‌లో స్పోర్ట్స్ కోటా

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఐఐటీ మద్రాస్ కీలక నిర్ణయం తీసుకొన్నది. యూజీ ప్రోగ్రాముల్లో స్పోర్ట్స్ కోటాను ప్రవేశపెట్టింది. ఐఐటీల్లో మద్రాస్ ఐఐటీయే తొలిసారిగా ఈ కోటాను ప్రవేశపెట్టింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా జోసా, లేదా ప్రత్యేక పోర్టల్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తామని ఐఐటీ మద్రాస్ వర్గాలు వెల్లడించాయి.

• నర్సింగ్ ఆఫీసర్లకు కౌన్సెలింగ్ ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): నర్సింగ్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చేందుకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్తు (టీవీవీపీ) పరిధిలో, మైనార్టీ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ, ఎంఎన్‌జే క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పరిధిలో శుక్రవారం స్టాఫ్‌నర్సులకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. అభ్యర్థులకు మరోసారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. వారంపది రోజుల్లో ప్లేస్ అలాట్‌మెంట్ ప్రక్రియ నిర్వహించనున్నారు. టీవీవీపీ పరిధిలో 736, ఎంఎన్‌జే పరిధిలో 81 మంది, మైనార్టీ గురుకులాల్లో 117 మందికి పోస్టింగ్ ఇచ్చారు. డీపీహెచ్ పరిధిలో నర్సింగ్ ఆఫీసర్లకు శనివారం నుంచి ఈ నెల 10 వరకు కౌన్సెలింగ్ జరుగనున్నది.

ఐదేండ్లు పనిచేసేలా 'బాండ్'

ఎంఎన్‌జే క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పరిధిలో జరిగిన కౌన్సెలింగ్‌లో స్టాఫ్ నర్సులు/నర్సింగ్ ఆఫీసర్లుగా ఎంపికైన అభ్యర్థుల నుంచి రూ.100 విలువైన బాండ్ పేపర్‌పై అండర్‌టేకింగ్ తీసుకొన్నారు. కనీసం ఐదేండ్లపాటు ఇదే ఇన్‌స్టిట్యూట్‌లో కొనసాగుతానని ఒప్పుకొంటూ అభ్యర్థులతో సంతకాలు చేయించారు. గురుకులాల్లోనూ రూ.20 బాండ్ పేపర్‌పై కనీసం మూడేండ్లపాటు పనిచేసేలా బాండ్ రాయిస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని అంతమొందించే పనిలో మోదీ

- **సీపీఐ జాతీయ సమితి సమావేశంలో డీ రాజా**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతమొందించి, ఏకస్వామ్య, ఫాసిస్టు, నియంతృత్వ వ్యవస్థను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డీ రాజా విమర్శించారు. మూడు రోజుల సీపీఐ జాతీయ సమితి సమావేశాలు శుక్రవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో రాజా మాట్లాడుతూ.. అధ్యక్ష తరహా పరిపాలన దిశగానే.. ఒకే దేశం-ఒకే ఎన్నిక అనే నినాదాన్ని మోదీ తెరపైకి తీసుకొస్తున్నారని ఆరోపించారు. త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశాన్ని బీజేపీ చేతిలో నుంచి విముక్తి కల్పించాలని పిలుపునిచ్చారు. మరోసారి మోదీ అధికారంలోకి వస్తే దేశం, దేశ భవిష్యత్తు ఏమవుతుందో అనే ఆందోళన నెలకొన్నదని, అందుకే ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామిగా ఉన్నదని చెప్పారు. భారత దేశాన్ని రక్షించేందుకే 'దేశ్ బచావో.. బీజేపీ హటావో' అన్న నినాదాన్ని ఇండియా కూటమి ఇచ్చిందని తెలిపారు. సమావేశాలకు రామకృష్ణ పాండా, కూనంనేని సాంబశివరావు, నిషా సిద్ధూ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

యువతకు కాంగ్రెస్ నయవంచన

- **గ్రూప్-1 నోటిఫికేషన్‌పై రాష్ట్ర సర్కారు మోసం**
- **కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు తెలంగాణ యువతను మోసం చేసిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఫిబ్రవరి 1న గ్రూప్-1 నోటిఫికేషన్ వేస్తామని చెప్పారని, అట్టహాసంగా వార్తా పత్రికల్లో ప్రకటనలు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. ఒకటో తేది దాటిపోయినా ఇంతవరకు నోటిఫికేషన్ ఊసేలేదని ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేయడంలో ఆ పార్టీకి ఘనమైన చరిత్ర ఉన్నదని పేర్కొన్నారు. ఇప్పుడు మరోసారి తన నిజస్వరూపాన్ని బయటపెట్టిందని స్పష్టం చేశారు. ఇతర వాగ్దానాలనూ దాటవేసే ప్రయత్నమూ చేస్తున్నదని అనుమానం వ్యక్తం చేశారు.

5 నుంచి 'గావ్ చలో, ఘర్ చలో'

ఈ నెల 5 నుంచి 8 వరకు 'గావ్ చలో, ఘర్ చలో' కార్యక్రమం నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి, ఆ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీ ఆధ్వర్యంలో పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 10 నుంచి పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా రథయాత్రలు చేపట్టాలని నిర్ణయించారు. అభ్యర్థులను ప్రకటించిన తర్వాతే రథయాత్రలు చేస్తే బాగుంటుందని లోక్‌సభ టికెట్ ఆశావహులు వినతిని, రాష్ట్ర నాయకత్వం పట్టించుకోలేదని సమాచారం. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు అంకిరెడ్డి సుధీర్‌రెడ్డి, బొల్లపు సురేందర్‌రెడ్డి బీజేపీలో చేరారు.

ఆ కాల్పులు మా తప్పే

- **ఇంద్రవెల్లి ఘటనపై ఆ రోజే క్షమాపణ చెప్పాం**
- **అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటున్నాం**
- **త్వరలో 500కే గ్యాస్ సిలిండర్**
- **ఇంద్రవెల్లి సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

ఇంద్రవెల్లి స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, సీతక్క, తుమ్మల, సురేఖ, ఎమ్మెల్యే పటేల్, సీఎస్

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): ఇంద్రవెల్లిలో 1981లో జరిగిన కాల్పులు తమ పార్టీ ప్రభుత్వ తప్పేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ పునర్నిర్మాణ బహిరంగ సభలో రేవంత్ మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర పాలకులు తెలంగాణ ఆదివాసీ బిడ్డలను తుపాకీ తూటాలతో కాల్చి, వాళ్లు నేలకు ఒరుగుతుంటే.. రక్తం చిందుతుంటే నిస్సహాయులై చేతులు కట్టుకుని కూర్చున్నారని, అది అప్పుడు జరిగిన తప్పు అని సీఎం చెప్పారు. అయితే ఆ తప్పుకు తాను ఏనాడో క్షమాపణ కోరానని తెలిపారు. నాడు అమరులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలతో పాటు, ఇండ్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకునే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ఉమ్మడి పాలనలో జరిగిన దుష్టాంతాలను సరిదిద్దడానికే సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని అన్నారు. ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటామని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించే బాధ్యత ఇందిరమ్మ రాజ్యం తీసుకుంటదని చెప్పారు. అందులో భాగంగానే గూడేలకు రోడ్లు, తాగడానికి నీళ్లు, నాగోబా గుడి అభివృద్ధికి నిధులు, ట్రైకార్ నిధులతో విద్యార్థుల చదువు కోసం అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించుకున్నామని అన్నారు.

త్వరలో 15 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ

మరో 15 రోజుల్లో 15వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆడబిడ్డలను ఆదుకొనేందుకు, వారిని కట్టెలపొయ్యి కష్టాల నుంచి కాపాడేందుకు త్వరలో రూ.500లకే ఇంటింటికీ సిలిండర్ ఇచ్చే పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. లక్ష మంది ఆడబిడ్డలతో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ చేతుల మీదుగా రూ.500లకే సిలిండర్ పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. త్వరలోనే ఇంటింటికీ 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తామని పునరుద్ఘాటించారు. గత సంవత్సరం ఎవరెవరు ఎంతెంత కరెంట్ వాడారో.. ఆ లెక్కలు గట్టి తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత కరెంట్ స్తామని తెలిపారు. తుమ్మిడిహట్టి దగ్గర సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తామని, కుప్టీ, సదర్మాట్ ప్రాజెక్టులను కడుతామని, కడెం ప్రాజెక్టును మరమ్మతు చేస్తామని చెప్పారు.

ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలె..

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడానికి కాంగ్రెస్ ఎంపీలను గెలిపించుకోవాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్‌గాంధీ వేల కిలోమీటర్లు పాద యాత్ర చేస్తున్నారని, వారి నాయనమ్మ, తండ్రి దేశం ప్రాణాలిచ్చారని అన్నారు. అలాంటి గొప్ప నాయకుడు, ఇందిరమ్మ మనవడు ఈ దేశానికి ప్రధాన మంత్రి కావాలి అని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలంటే ఆదిలాబాద్ గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగరాలని అన్నారు.

5లోగా క్వార్టర్లు ఖాళీ చేయాలి

- **తాజా మాజీ ఎమ్మెల్యేలకు శాసన సభా కార్యదర్శి నోటీసులు**
- **కిరాయి ఇండ్లు దొరికేదాకా గడవు ఇవ్వాలంటున్న మాజీలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): తాజా మాజీ ఎమ్మెల్యేలు తక్షణం తమ క్వార్టర్లను ఖాళీ చేయాల్సిందిగా రాష్ట్ర శాసనసభా కార్యదర్శి శుక్రవారం మళ్లీ నోటీసులు పంపారు. డిసెంబర్ 3 న ఎన్నికల ఫలితాలు వచ్చాయని, కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారికి క్వార్టర్లను కేటాయించాల్సి ఉంటుందని కార్యదర్శి ఆ నోటీసులో పేర్కొన్నారు. డిసెంబర్ 15న తొలి నోటీసు ఇచ్చిన ఆయన ఆ తర్వాత వరుసగా రిమైండర్ నోటీసులు పంపారు. తాజాగా గత నెల 31న చివరి నోటీసు అందించారు. ఫిబ్రవరి 5లోగా క్వార్టర్లను ఖాళీ చేయాలని పేర్కొన్నారు. ఒకవేళ క్వార్టర్లను ఖాళీ చేయకపోతే నీరు, విద్యుత్తు సదుపాయం నిలిపివేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం ఉంటున్న వారు ఖాళీ చేస్తే క్వార్టర్లకు మరమ్మతులు చేసి, వాటిని కొత్త వారికి కేటాయిస్తామని అంటున్నారు. ఈనెల 5 తేదీని గడవుగా నోటీసుల్లో పేర్కొన్నారు. ఉన్నపళంగా క్వార్టర్లు ఖాళీ చేయమంటే ఎట్లా అని మాజీ ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల్లోనే నాలుగు నోటీసులు ఇచ్చారని, ఇప్పటికిప్పుడు ఖాళీ చేయడం ఇబ్బంది అని, గతంలో మాజీ ఎమ్మెల్యేలకు కూడా క్వార్టర్లు ఇచ్చేవారని, తమకు కూడా క్వార్టర్లు ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఈ మేరకు వారు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కూడా కలిశారు. తాము కిరాయి ఇండ్లను వెతుక్కునే వరకు ఇక్కడ ఉండేందుకు గడవు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

రాష్ట్రంలో ప్రమాదకరంగా వాయుకాలుష్యం

- **మేడారంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం**
- **అటవీ, పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్**

హైదరాబాద్, ఫిబ్రవరి2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రమాదకరంగా మారిన వాయు కాలుష్యాన్ని నియంత్రించి, గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేయాలని అటవీ-పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో మేడారం జాతర నేపథ్యంలో కాలుష్య నియంత్రణమండలి, రవాణాశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడారం జాతరలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సమీక్షలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యకార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ పాల్గొన్నారు.

శివబాలకృష్ణ బంధువు పేరిట 3 లాకర్ల గుర్తింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): భారీ అక్రమాస్తుల కేసులో అరెస్టయిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ భార్య బంధువైన భరత్ పేరున మూడు లాకర్లను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీ ఉన్నతాధికారుల విచారణలో మూడో రోజైన శుక్రవారం పలు కీలక విషయాలు వెల్లడయ్యాయి. శివబాలకృష్ణ కొందరు బినామీలకు రెండు నెలల క్రితం కానుకలుగా ఇచ్చిన హోండా సిటీ కార్ల విషయంపై ఆరా తీస్తున్నారు. ఇన్ఫ్రా కంపెనీల్లో పెట్టుబడులు, బినామీలతో ఉన్న సంబంధాలపైనే ఎక్కువగా ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ కేసులో మరో ఐఏఎస్ అధికారి హస్తం కూడా ఉన్నదనే విషయం విచారణలో తేలినట్టు సమాచారం. రేపో, ఎల్లుండో సదరు ఐఏఎస్ అధికారిని సైతం విచారిస్తారని, ఆయన ఆస్తులు, బంధువుల ఇండ్లపై సోదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. అవసరమైతే మరోమారు విచారిస్తామని, మొదటిరోజు సమాధానాలకు, ఇప్పుడు చెప్పేవాటిని బేరీజు వేసుకొని విచారణ వివరాలను మీడియాకు వెల్లడిస్తామని ఓ ఉన్నతాధికారి చెప్పారు.

ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్స్

- **ఏ సమస్యలైనా వారికి చెప్పొచ్చు**
- **మీడియా ప్రతినిధులే అంబాసిడర్లు**
- **'సైబర్ క్రైమ్స్ అవగాహన'లో డీజీపీ**

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీజీపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో 870 మంది కానిస్టేబుళ్లను సైబర్ వారియర్స్‌గా తీర్చిదిద్దామని, రాష్ట్రంలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక సైబర్ వారియర్ ఉన్నాడని, సైబర్ నేరాలకు సంబంధించిన ఏ సమస్యలైనా వారితో చెప్పుకోవచ్చని డీజీపీ రవిగుప్తా వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో క్రైమ్ రిపోర్టర్లకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ రవిగుప్తా మాట్లాడుతూ.. మీడియా ప్రతినిధులే సైబర్ అంబాసిడర్లని అభివర్ణించారు. వారి ద్వారానే సైబర్ నేరాలపై ప్రజల్లో బాగా అవగాహన పెరుగుతుందని చెప్పారు. కేవలం స్వీయ అవగాహన ద్వారానే 60 శాతం సైబర్ నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (టీ4సీ) ఇప్పటివరకు 1930 ఫోన్ నంబర్ ద్వారా వచ్చిన 90వేలకు పైగా కాల్స్‌ను నిర్వహించి.. ఎంతో మంది బాధితులకు బాసటగా నిలిచిందని కొనియాడారు. సరికొత్తగా రోజుకొక కొత్త రూపంలో నమోదవుతున్న సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, ఏడీజీ శిఖాగోయెల్ పిలుపునిచ్చారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ద్వారా ఇప్పటివరకు రూ.128 కోట్లు ఫ్రీజ్ చేశామని, రూ.8 కోట్లను బాధితులకు అప్పగించామని ఆమె వెల్లడించారు. ఈ వర్క్‌షాపులో సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, డార్క్‌వెబ్ మోసాలు, ఏఐ పోకడలు, అప్రమత్తంగా ఉండాల్సిన తీరును సైబర్ నిపుణుడు సన్నీ క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీలు దేవేందర్ సింగ్, విశ్వజిత్, డీసీపీ ప్రసాద్ పాల్గొన్నారు.

నాకు ప్రాణహాని ఉంది: వైఎస్ సునీతారెడ్డి

- **సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): తనను చంపుతామని బెదిరిస్తూ సోషల్ మీడియా ద్వారా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పోస్టులు పెడుతూ బెదిరింపులకు గురిచేస్తున్నారని దివంగత నేత వైఎస్ వివేకానందరెడ్డి కూతురు డాక్టర్ వైఎస్ సునీతారెడ్డి సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. దుండగుల నుంచి తనకు ప్రాణహాని ఉన్నదని, బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమె సైబర్‌క్రైమ్స్ డీసీపీ శిల్పవల్లికి ఫిర్యాదు చేశారు. లేపేస్తామనే అర్థం వచ్చేలా దుండగులు ఫేస్‌బుక్‌లో పోస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు బాధితురాలు పేర్కొన్నారు. బెదిరింపు పోస్టులపై కేసు నమోదు చేసి, దర్యాప్తులో దుండగులను గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటామని డీసీపీ పేర్కొన్నారు.

'ప్లాస్మా' రాకెట్ గుట్టు రట్టు

- **బ్లడ్ బ్యాంకుల నుంచి కొని కంపెనీలకు అమ్మకం**
- **నిందితుడు రాఘవేంద్ర నాయక్**
- **ఎనిమిదేండ్లుగా గుట్టుగా దందా**
- **డీసీఏ దాడులతో వెలుగులోకి...**
- **పలు బ్లడ్ బ్యాంకుల్లో తనిఖీలు**

నిల్వ ఉంచిన రక్తం, ప్లాస్మా ప్యాకెట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): అక్రమంగా మానవ ప్లాస్మాను సేకరించి, విక్రయిస్తున్న రాకెట్‌ను ఛేదించినట్టు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పలు బ్లడ్ బ్యాంక్‌లపై అధికారులు దాడులు చేసిన సందర్భంగా ఈ దందా వెలుగులోకి వచ్చినట్టు చెప్పారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూసాపేటలోని భవానీ నగర్‌లో నిర్వహిస్తున్న 'హీమో సర్వీస్ ల్యాబొరేటరీస్'లో డీసీఏ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున నిల్వ చేసిన మానవ రక్తాన్ని, ప్లాస్మాను గుర్తించారు. నగరంలోని పలు బ్లడ్ బ్యాంకుల నుంచి అక్రమంగా రక్తాన్ని, ప్లాస్మాను సేకరించి ఇలా నిల్వ చేశారని, వీటిని అక్రమంగా విక్రయిస్తున్నట్టు కనిపెట్టారు. నిర్వాహకుడు ఆర్ రాఘవేంద్ర నాయక్ ఎనిమిదేండ్లుగా ఈ దందా చేస్తున్నట్టు తేల్చారు. అంతేకాకుండా నేరుగా మనుషుల నుంచి రక్తాన్ని సేకరించి నిల్వ చేస్తున్నట్టు గుర్తించారు. విచారణలో భాగంగా మియాపూర్‌లోని శ్రీకర హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్, దారుల్షిఫాలోని అబీద్ అలీ ఖాన్ లయన్స్ ఐ హాస్పిటల్‌లో ఉన్న న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్, ఏపీ కర్నూల్‌లో ఉన్న ఆర్ ఆర్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ నుంచి అక్రమంగా ప్లాస్మా కొనుగోలు చేస్తున్నట్టు రాఘవేంద్ర నాయక్ ఒప్పుకొన్నాడని డీజీ తెలిపారు. అతడు బాలానగర్‌లోని క్లిన్స్ ల్యాబ్స్, క్యూపీఎస్ బయోసర్వ్ ఇండియా, ఐడీపీ మల్లాపూర్‌లోని శిల్పా మెడికా, మదీనాగూడలోని జెనసిస్ రీసెర్చ్, చర్లపల్లిలోని విమ్టా ల్యాబ్స్, విశాఖపట్నంలోని ఆక్టిమస్ బయోసైన్సెస్, పుణెలోని క్లినోవి రీసెర్చ్, బెంగళూరులోని జీ7 సినర్జిన్‌కు అక్రమంగా ప్లాస్మాను అమ్ముతున్నట్టు గుర్తించామని వివరించారు. అతడు ఇప్పటివరకు 6వేల యూనిట్లను విక్రయించారని తెలిపారు. బ్లడ్ బ్యాంకుల నుంచి రూ.700 కొని, కంపెనీలకు రూ.3,800కు విక్రయిస్తున్నాడని చెప్పారు. ఈ దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సౌభాగ్యలక్ష్మి, శ్రీనివాస్, సహజ, చంద్రశేఖర్, సంతోష్, కార్తిక్ శివ చైతన్య తదితరులు పాల్గొన్నారు. ఈ సమాచారం ఆధారంగా అధికారులు ఆయా బ్లడ్ బ్యాంకులు, కంపెనీల్లో సోదాలు నిర్వహించినట్టు తెలిసింది.